కుట్టు శిక్షణ కేంద్రాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్



కొర్రెముల్‌లో స్కూల్ డ్రెస్సులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య

ఘట్‌కేసర్: కొర్రెముల్ మహిళ కుట్టు శిక్షణ కేంద్రాన్ని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి మహిళలతో మాట్లాడారు. పాఠశాల విద్యార్థులకు సకాలంతో స్కూల్ డ్రెస్సులు అందజేయాలని సూచించారు. స్కూల్ డ్రెస్సులు తొందరగా కుట్టడానికి అవసరమైతే నూతనంగా మహిళలను గుర్తించాలన్నారు.

డ్రైనేజీ పనులను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్



పనులను పరిశీలిస్తున్న మున్సిపల్‌చైర్మెన్‌చంద్రారెడ్డి తదితరులు

కీసర: నాగారం మున్సిపల్ పరిధిలోని బీఎంఆర్ ఎన్‌క్లేవ్‌లో కొనసాగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను గురువారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ నిధులతో వివిధ కాలనీల్లో అభివృద్ధి పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసా పారాయణ మహాయజ్ఞం



పూజల్లో పాల్గొన్న భక్తులు

మేడ్చల్ రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని హనుమాన్ ఆలయ 10 వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు అనంతరం లక్ష నాగవల్లి దళార్చన, లక్ష హనుమాన్ చాలీసా పారాయణ మహాయజ్ఞం, మహాపూర్ణాహుతి హారతి, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. పూజల్లో దుర్గాప్రసాద్ స్వామీజీ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వార్షికోత్సవ వేడుకల్లో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు, హనుమాన్ దీక్షాదారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ముగిసిన ఏక్ భారత్- శ్రేష్ట్ భారత్



శిబిరంలో పాల్గొన్న తెలంగాణ, ఏపీ, రాజస్థాన్ రాష్ట్రాల ఎన్‌సీసీ విద్యార్థులు

మేడ్చల్ రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్ కళాశాలలో ఎన్‌సీసీ ఆధ్వర్యంలో 10 రోజుల పాటు సాగిన ఏక్ భారత్- శ్రేష్ట్ భారత్ కార్యక్రమం గురువారం ముగిసింది. శిబిరంలో తెలంగాణ, ఏపీ రాష్ట్రాలతో పాటు రాజస్థాన్‌కు చెందిన ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు పాల్గొనగా వారికి పలు అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు రాష్ట్రాలు, వాటి ప్రాముఖ్యత, సంప్రదాయాలు, ఆహారం, ఇతర అలవాట్లను వివరించారు. కార్యక్రమంలో క్యాంపు కమాండెంట్ అనిల్ కుమార్, డిప్యూటీ కమాండెంట్ ఆనంద్ రావు, సీఎంఆర్ గ్రూప్స్ కార్యదర్శి గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి ఆహ్వానం

అల్వాల్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని కోరుతూ మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి అల్వాల్ జేఏసీ నాయకులు గురువారం ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. 10 సంవత్సరాల పూర్తి చేసుకున్న సందర్భంగా అల్వాల్ జేఏసీ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సురేందర్‌రెడ్డి, పరమేష్ తదితరులున్నారు.

సమస్యలు పరిష్కరిచండి

మల్కాజిగిరి: గౌతంనగర్ డివిజన్ పరిధిలోని సమస్యలు పరిష్కరించాలని బీజేపీ నాయకులు మల్కాజిగిరి సర్కిల్ డీసీని గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. డివిజన్ అధ్యక్షుడు లక్ష్మణ్‌రావు, కార్యదర్శి అనిల్‌కుమార్ మాట్లాడుతూ సాయినగర్ సాయిబాబా దేవాలయం వద్ద అసంపూర్తిగా నాలా, రహదారి నిర్మాణం పనులు ఉన్నాయన్నారు. స్థానిక కార్పొరేటర్ కార్యాలయానికి కూతవేటు దూరంలోనే ఉన్నా సమస్యను పరిష్కరించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు కాలనీల్లో డ్రైనేజీ అస్తవ్యస్తంగా ఉందని, వర్షాకాలం ప్రారంభం కాకముందే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డీసీని కోరామన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో సీనియర్ నాయకులు శ్రీనివాస్‌ముదిరాజ్, ధన్‌రాజ్, గణ, నాగరాజు తదితరులు ఉన్నారు.

నాలాల్లో పూడిక పనులు వేగవంతం చేస్తాం

మల్కాజిగిరి: నాలాల్లో పూడికతీసే పనులను వేగవంతంగా పూర్తి చేస్తామని డీఈ మహేష్ అన్నారు. దీన్‌దయాళ్‌నగర్, సంతోషిమానగర్ ప్రాంతాల్లో నాలాను గురువారం ఆయన పరిశీలించారు. మహేష్ మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభానికి ముందే పూడిక పనులు తీస్తామని, కొన్నిచోట్ల మట్టి తీసుకొని వచ్చి పోసినట్లుగా గుర్తించామన్నారు. ప్రజలు కూడా సహకరించాలని నాలాల్లో చెత్తాచెదారంతో పాటు పరుపులు, కొబ్బరిబోండాలు వంటివి వేయకుండా ఉండాలన్నారు. వర్క్ ఇన్‌స్పెక్టర్లు మహేందర్, రమేష్, నరేందర్ ఉన్నారు.

అడుగడుగునా అక్రమ నిర్మాణాలు

- గుండ్లపోచంపల్లిలో ఎక్కడ చూసినా ఇంతే..
- నోటీసులతో సరిపెడుతున్న అధికారులు



అయోధ్య చౌరస్తా సమీపంలో సెట్‌బ్యాక్ వదలకుండా నిర్మిస్తున్న ప్రహరీని కూల్చిన మున్సిపల్ అధికారులు

మేడ్చల్ రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో అక్రమ నిర్మాణాలకు అడ్డూ, అదుపు లేకుండా పోయింది. మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడ చూసినా అక్రమ నిర్మాణాలే దర్శనమిస్తున్నాయి. వీటిని అడ్డుకోవాల్సిన అధికారులు, పాలకులు తమ జేబులు నింపుకుని అక్రమార్కులను ప్రోత్సహిస్తూ మున్సిపల్ ఆదాయానికి గండికొడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఎక్కడ చూసినా అక్రమ నిర్మాణాలే..

గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ నగర శివారులో ఉండడంతో ఇక్కడ విల్లాలు, అపార్ట్‌మెంట్‌లు ఎక్కువే.. మరోవైపు మైసమ్మగూడ, కండ్లకోయలో పదుల సంఖ్యలో ఇంజనీరింగ్ కళాశాలలు ఉండడంతో విద్యార్థులు ఉండేందుకు హాస్టళ్లు, వ్యాపార సముదాయాలు పెద్ద ఎత్తున నెలకొన్నాయి. దీంతో మున్సిపల్ పరిధిలో బహుళ అంతస్తులకు, వ్యాపార సముదాయ భవనాలకు మంచి డిమాండ్ ఉండడంతో పెద్ద ఎత్తున కమర్షియల్ భవనాలు, అపార్ట్‌మెంట్లు నిర్మాణం జరిపేందుకు బిల్డర్లు, వ్యాపారులు ఆసక్తి చూపుతూ నిబంధనల ప్రకారం నిర్మాణాలు జరపకుండా అడుగడుగునా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. మున్సిపల్ పరిధిలోని గుండ్లపోచంపల్లి, కండ్లకోయ,మైసమ్మగూడలో పెద్ద ఎత్తున అపార్టుమెంట్ భవనాల నిర్మాణాలు జరుగుతుండగా బాసిరేగడి, జ్ఞానాపూర్, సుతారిగూడ, అర్కల్‌గూడ గ్రామాల్లో గోదాంలా నిర్మాణ పనులు సాగుతున్నాయి.

నిబంధనలకు నీళ్లు....

బహుళ అంతస్తులు, కమర్షియల్ నిర్మాణాలు, గోదాంల నిర్మాణాలు చేపట్టే వారు నిబంధనల ప్రకారం హెచ్‌ఎండీఏ అనుమతులు పొందాల్సి ఉంటుంది. కానీ నిర్మాణదారులు హెచ్‌ఎండీఏ రూల్స్ ప్రకారం నిర్మాణాలు చేపట్టాలంటే సెట్ బ్యాక్‌లు వదలాల్సి ఉండడం, ప్రభుత్వానికి చలాన్ మొత్తం చెల్లించడం వంటి షరతులతో కూడుకున్న పనిగా భావిస్తున్న బిల్డర్లు స్థానిక ప్రజాప్రతినిధులను ప్రసన్నం చేసుకుంటున్నారు. దీంతో వారు అంతా తాము చూసుకుంటాములే అని వారికి ధీమా ఇస్తూ అన్నీ తానై వ్యవహరిస్తున్నారు. మున్సిపల్ కార్యాలయంలో జీ ప్లస్ 2 అనుమతులు తీసుకుని ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపడుతున్నారు.

కాసుల వేటలో పాలకులు, మున్సిపల్ సిబ్బంది...

అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన మున్సిపల్ సిబ్బంది, కౌన్సిలర్లు కాసుల వేటలో పడి అందినంత సంపాదించుకుంటున్నారని, ఎక్కడికక్కడ అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తూ పాలకులు ఓ రేటు, మున్సిపల్ అధికారులు ఓ రేటు నిర్ణయించుకుని అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారని పెద్ద ఎత్తున ప్రచారం సాగుతోంది. ఇక అక్రమ నిర్మాణాల విషయంలో అన్ని పార్టీల కౌన్సిలర్లు ఏకాభిప్రాయంతో ముందుకు సాగుతున్నట్లు తెలుస్తుంది. మున్సిపల్ కార్యాలయంలో శాశ్వత టీపీఓ లేకపోవడం కూడా కొందరు సిబ్బందికి వరంగా మారింది. ఇలా అక్రమ నిర్మాణాలను అడ్డుకుని మున్సిపల్ ఆదాయాన్ని పెంచాల్సిన వారు అన్నీతామై వ్యవహరిస్తూ తమ జేబులు నింపుకుని విహారయాత్రలకు వెళ్తూ జల్సాలు చేస్తూ మున్సిపల్ ఆదాయానికి గండికొట్టడమేంటని, సామాన్యుల వద్ద పన్నులు ముక్కు పిండి వసూళ్లు చేసే అధికారులు అక్రమ నిర్మాణాలను ఎందుకు తొలగించడం లేదని మండిపడుతున్నారు. ఉన్నతాధికారులైనా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ప్రారంభానికి ముందే యూనిఫాం అందించాలి



మూడుచింతలపల్లి పాఠశాలను సందర్శిస్తున్న కలెక్టర్

శామీర్‌పేట్: ప్రభుత్వ పాఠశాల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు పాఠశాలల ప్రారంభానికి ముందే యూనిఫాం అందించాలని జిల్లా కలెక్టర్ గౌతమ్ అధికారులను ఆదేశించారు. గురువారం మూడు చింతల పల్లి మండల కేంద్రంతో పాటు కేశవరం గ్రామంలో పర్యటించిన ఆయన స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో స్కూల్ యూనిఫామ్స్ కుట్టు శిక్షణ కేంద్రాలను సందర్శించారు. దుస్తుల తయారీ విధానాన్ని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దుస్తుల తయారీలో నాణ్యత పాటించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధిఇ అధికారి సాంబశివరావు, ఎంపీఓ వత్సలాదేవి, అధికారులు పాల్గొన్నారు.

ముందు జాగ్రత్తగా నాలా క్లీనింగ్ పనులు

కీసర: వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని నాగారం మున్సిపాలిటీ పరిధిలోని వివిధ చెరువుల నుండి వర్షపు నీరు, వివిధ కాలనీలనుండి వస్తున్న మురుగునీరు సాఫీగా దిగువ ప్రాంతాలకు వెళ్లే విధంగా నాలా క్లీనింగ్ పనులను చేపడుతున్నామని నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. గురువారం ఎస్సీకాలనీ సమీపంలో జరుగుతున్న పనులను ఆయన కౌన్సిలర్ పంగ హరిబాబుతో కలిసి పరిశీలించారు. అన్నరాయిని చెరువు నుండి చర్లపల్లి చెరువు వరకు, రాంపల్లి చౌరస్తా సమీపంలోగల కుమ్మరి కుంటనుండి ఎస్సీకాలనీ, మీదుగా చర్లపల్లి చెరువు వరకు గల నాలాల క్లీనింగ్ పనులను మున్సిపల్ నిధులు వెచ్చించి చేపడతామన్నారు. అదేవిధంగా రాంపల్లి చెరువునుండి ఎర్రమల్లె వాగుమీదుగా యనంపేట పరిధివరకు గల నాలాను, చర్లపల్లి రహదారిలోగల రాంపల్లి పాత చెరువునుండి ఇస్మాయిఖాన్ గూడ సమీపం వరకు గల మరో నాలా క్లీనింగ్‌పనులను కూడా చేపతామన్నారు.

వైభవంగా శ్రీవారి కల్యాణోత్సవం



స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు



స్వామి వారి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మండలం వెంకటాపూర్‌లో వెలిసిన కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ అలివేలుమంగ సహిత శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామి వారి కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయం ఆవరణలో స్వామివారి దంపతుల విగ్రహ మూర్తులను బంగారు ఆభరణాలతో మండపంలో ప్రతిష్ఠించారు. మాజీ ఎమ్మెల్యే సుధీర్‌డ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేశ్‌యాదవ్, ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, ఆలయ చైర్మన్ వేణుగోపాల్‌ముదిరాజ్, ఎంపీటీసీలు రామారావుముదిరాజ్, ఈఓ భాగ్యలక్ష్మీ, ఎఫ్‌ఎస్‌సీఎస్ డైరెక్టర్లు లక్ష్మారెడ్డి బాల్‌రాజ్‌యాదవ్, స్వామి వారిని, అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్ ముదిరాజ్, నవీన్‌ముదిరాజ్, కుమార్‌ముదిరాజ్, శంకర్ ముదిరాజ్, లింగంముదిరాజ్, యాదగిరి, కుమార్, నరసింహా పాల్గొన్నారు.

వృద్ధురాలు అదృశ్యం



విజయలక్ష్మి (ఫైల్)

మేడ్చల్: మేడ్చల్ పట్టణంలో ఓ వృద్ధురాలు అదృశ్యమైంది. ఎస్ఐ మాజీద్ అలీ తెలిపిన మేరకు.. మేడ్చల్ పట్టణంలోని అర్బన్ హోమ్‌లెస్ షెల్టర్‌లో ఉంటున్న విజయలక్ష్మి(69)కి మానసిక పరిస్థితి బాగాలేదు. గురువారం మధ్యాహ్నం బయటికి వెళ్లి తిరిగి రాలేదు.దీంతో హోమ్‌లెస్ షెల్టర్ నిర్వాహకులు మేడ్చల్ పోలీసులను ఫిర్యాదు చేశారు.

నకిలీ పత్రాలు సృష్టించి ప్లాటు విక్రయం

ఒకరి అరెస్టు



నిందితుడు సత్తు మహేష్

కీసర: నకిలీపత్రాలు సృష్టించి యజమానికి తెలియకుండా మరొకరికి ఇంటి స్థలం విక్రయించిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కీసర సీఐ వెంకటయ్య తెలిపిన మేరకు.. యాదాద్రి- భువనగిరి జిల్లా రాజాపేట మండలం రేనిగుంటగ్రామానికి చెందిన సత్తు మహేష్ , బండ్లగూడ ప్రగతినగర్‌లో నివాసం ఉంటూ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. ఇతనితోపాటు పాషా బాయి , వీరభద్రరావ్, కలిసి గోధుమకుంట టీపీఎస్ హౌసింగ్ ప్రైవేటు లిమిటెడ్ వెంచర్ ఫేస్-3లో ఓ ప్లాట్‌లోకి చాల రోజుల నుండి యజమాని ఎవరూ రావడం లేదని గమనించారు. పథకం ప్రకారం యజమానికి తెలియకుండా నకిలీ పత్రాలుసృష్టించి వీరభద్రరావుకు విక్రయించారు. ఈపథకంలో మహేష్, పాషా బాయ్,వీరభద్రరావు ప్రధాన సూత్రధారులు కాగా గురువారం మహేష్‌ను అరెస్టు చేశారు. పాషాబాయి పరారీలో ఉన్నారు. వీరభద్రరావును గతంలోనే అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

మేయర్ కిడ్నాప్‌నకు యత్నం.. నిందితులపై కేసు

ఘట్‌కేసర్: పీర్జాదిగూడ మేయర్ జక్కా వెంకట్‌రెడ్డిని కిడ్నాప్ చేసేందుకు ప్రయత్నించిన కార్పొరేటర్ అమర్‌సింగ్, అతని అనుచరులపై ఘట్‌కేసర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన మేరకు.. ఈ నెల 19న పీర్జాదిగూడ మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి, కొందరు బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు సూర్యాపేట్ నుండి శంషాబాద్ విమానాశ్రయానికి మూడు కార్లలో వెళ్తున్నారు. పెద్దఅంబర్‌పేట్‌లో ఓఆర్‌ఆర్ వద్ద అమర్‌సింగ్, డిప్యూటీ మేయర్ శివకుమార్ గౌడ్, వీరి అనుచరులు జక్కా వెంకట్‌రెడ్డి కారును వెంబడించి కిడ్నాప్ చేసేందుకు ప్రయత్నించారు. అదేరోజు రాత్రి ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని టోల్‌ప్లాజా వద్ద జక్కా కారుకు అడ్డంగా కార్లు నిలిపి అమర్ సింగ్, శివకుమార్ గౌడ్, శ్రీధర్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, అంజిరెడ్డి, నర్సింహారెడ్డి తదితరులు దాడికి యత్నించారు. పోలీసులకు, మీడియాకు మేయర్ సమాచారం అందించడంతో వారు పారిపోయారు. మేయర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం పలువురిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భారీ వర్షానికి నేలకొరిగిన చెట్లు





మల్లాపూర్: గురువారం తెల్లావారుజామున కురిసిన భారీ వర్షానికి మల్లాపూర్, నాచారం డివిజన్ పరిధిలోని లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. దీనికి గాలి దూమారం రావడంతో నాచారం డివిజన్ పరిధిలోని భవానీనగర్ రోడ్-3లో రెండు భారీ చెట్లు నెలకొరిగాయి. అంతేగాకుండా విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. దీంతో నాచారంలో విద్యుత్ సరాఫరా నిలిచి పోయింది. కాలనీవాసులు కరెంట్ లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కాలనీవాసులు జీహెచ్‌ఎంసీ సిబ్బందితో కలిసి విరిగిన చెట్ల కొమ్మలను తొలగించారు. అనంతరం విద్యుత్ అధికారులు నూతనంగా రెండు విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్దరించారు.

కాంగ్రెస్ నేతపై దాడి కేసులో ఒకరి అరెస్ట్

పోచారం: సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సింగిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డిపై దాడి చేసిన వ్యక్తుల్లో ఒకరైన కొంతం కిరణ్‌రెడ్డిని పోచారం పోలీసులు గురువారం అరెస్ట్ చేసి రిమాండ్ కోసం చర్లపల్లి జైలుకు పంపారు. పోలీసులు తెలిపిన మేరకు.. ఈ నెల 6వ తేదీన అన్నోజిగూడ ఫ్లైఓవర్ వద్ద శ్రీకాంత్ రెడ్డిపై కొంతం కిరణ్‌రెడ్డి, కొంతం శంకర్ రెడ్డి, నాగరాజురెడ్డి, వినయ్‌రెడ్డి దాడి చేసి గాయపర్చారు. దీంతో శ్రీకాంత్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన పై నలుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. గురువారం కిరణ్‌రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ కోసం చర్లపల్లి జైలుకు పంపారు. మిగిలిన ముగ్గురు వ్యక్తులు పరారీలో ఉన్నారు.

ధాన్యం సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలి

అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

ఘట్‌కేసర్: ధాన్యం కొనుగోళ్ల కేంద్రాల్లో మిగిలిన ధాన్యం, సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని మాదారం, ఎదులాబాద్‌లో ఐకేపీ ద్వారా నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి అక్కడ ఏర్పాటు చేసిన సదుపాయాలపై ఆరా తీశారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని వెంటనే తూకం వేసి ఆలస్యం చేయకుండా లారీలలో నింపి రైస్ మిల్లులకు పంపాలన్నారు. ధాన్యం తడిసిపోకుండా తర్పాలిన్ కవర్లు, గన్ని బ్యాగులు రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. అధికారులు సమన్వయంతో ధాన్యం కొనుగోలు చేయాలని, కొనుగోలు చేసిన వెంటనే ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేయాలన్నారు. అప్పుడే సకాలంలో బిల్లులు చెల్లిస్తారన్నారు. కార్యక్రమంలో పౌర సరఫరా శాఖ జిల్లా మేనేజర్ రాజేందర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



ఎదులాబాద్‌లో రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

కీసర: 11 కేవీ అంకిరెడ్డి విద్యుత్ ఫీడర్ మరమ్మతు పనుల కారణంగా నేడు (శుక్రవారం) ఉదయం 11 నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కీసర పరిధిలోని వీఆర్‌ఆర్ కాలనీ, రైస్ మిల్ ఏరియా, లక్ష్మీనగర్, కాలనీ తదితర కాలనీల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ మురళీకృష్ణ తెలిపారు.

- మరమ్మత్తుపనుల కారణంగా మధ్యాహ్నం 3 గంటలనుండి సాయంత్రం 5 గంటల వరకు కేజీఎఫ్ మెయిన్‌రోడ్డు ప్రాంతంలో విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు.

నాగారం మున్సిపాలిటీలో: నాగారం మున్సిపాలిటీపరిధిలో ఉదయం 11 నుండి మధ్యాహ్నం ఒంటి గంటవరకు బీఎంఆర్ కాలనీ, దత్తాత్రేయ కాలనీ, శివశక్తికాలనీ, ఎస్‌ఎల్‌ఎన్ కాలనీ, వెస్ట్ గాంధీ నగర్‌కాలనీ, భవానీనగర్,శివాలయం మెయిన్‌రోడ్డు, రాంపల్లిచౌరస్తాలో సరఫరా ఉండదన్నారు.

- మధ్యాహ్నం 3 నుండి సాయంత్రం 5 వరకు సింహపురి కాలనీ, ఓల్డ్‌విలేజ్, వికాస్‌నగర్, వెంకటేశ్వరకాలనీ, నవత ఎన్‌క్లేవ్, మధురానగర్, దుర్గయ్యనగర్, దత్తాత్రేయనగర్, శివశక్తి కాలనీ, తారపూరికాలనీ, లక్ష్మీనగర్, నాగారం ఓల్డ్‌విలేజ్‌లో విద్యుత్ అంతరాయం ఉంటుందని నాగారం విద్యుత్ ఏఈ కామేశ్వర్ రావు తెలిపారు.

మేడ్చల్ రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ మరమ్మత్తుల కారణంగా పలు కాలనీలలో శుక్రవారం విద్యుత్ అంతరాయం కలుగుతుందని ట్రాన్స్ కో ఏఈ వెంకట్‌గౌడ్ తెలిపారు. చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా గోల్డెన్ లీఫ్, అయోధ్య కాలనీ, ఎస్పలాన్ విల్లాస్,స్టెర్లింగ్ హోమ్స్, బీరప్ప కాలనీలలలో ఉదయం 9.30 నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ తెలిపారు.

పోచారం: నారపల్లి సబ్ స్టేషన్‌లో మరమ్మతులు, కరెంట్ తీగలకు తాకుతున్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపట్టినందున శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ ప్రదీప్ కుమార్ తెలిపారు. నారపల్లి ఫీడర్ పరిధిలోని సప్తగిరి కాలనీ, రేవతి రైస్ మిల్, నారపల్లి వీకర్ సెక్షన్ కాలనీ, అంజనీ స్కూల్ పరిసర ప్రాంతాలకు ఉదయం 11 నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

- ప్రతాపసింగారం ఫీడర్ పరిధిలోని కొర్రెముల గ్రామం, చౌదరిగూడ గ్రామంలోని కాలనీలు, బాలాజీనగర్ ప్రాంతాలకు మధ్యాహ్నం 2 నుండి సాయంత్రం 4 గంటల వరకు, ప్రతాపసింగారం అగ్రికల్చర్ ఫీడర్ పరిధిలోని సాదత్ అలీగూడ, నల్ల నర్సింహారెడ్డి కాలేజ్, సుప్రభాత్ టౌన్‌షిప్ ప్రాంతాలకు మధ్యాహ్నం 3:30 నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు.

అంకుషాపూర్‌లో...

ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అంకుషాపూర్ గ్రామం, జగత్‌స్వప్న వెంచర్, కేపాల్, అనురాగ్ కాలేజ్, వినూత్న హైట్స్, అరోరా కాలేజ్, శ్రీనిధి రిసార్ట్స్, గోల్డెన్ వ్యాలీ ప్రాంతాలకు, మధ్యాహ్నం 3 నుండి సాయంత్రం 5 గంటల వరకు కొండాపూర్, స్వర్ణ కుటీర్, పటేల్‌నగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఘట్‌కేసర్ ఏఈ సతీష్ కుమార్ తెలిపారు.

మంత్రికి ఆశీర్వచనం



కీసర: మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకొని గురువారం శ్రీ చీర్యాల లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానం వేదపండితులు నగరంలోని మంత్రి నివాసానికి వెళ్లి స్వామివారి ఆశీర్వచనం, మహాప్రసాదాన్ని అందజేసారు. ఆలయ చైర్మెన్ మల్లారపు లక్ష్మీనారాయణ, ధర్మకర్తశ్రీహరిగౌడ్ పాల్గొన్నారు.